ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

ముత్యాల ముగ్గుల పోటీలు రేపు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గులు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్ట్నర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం కేపీహెచ్‌బీ మూడోఫేజ్ రమ్యగ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల మహిళలు పాల్గొనవచ్చు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి, ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు, బతుకమ్మలను పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 6 వేలు, ద్వితీయ బహుమతి రూ. 4 వేలు, తృతీయ బహుమతి 3 వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 9985411022, 9700637537 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



నెహ్రూనగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

రోడ్లు తవ్వారు..
మరమ్మతులు మరిచారు

షాపూర్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు అభివృద్ధి పేరుతో రోడ్లను తవ్వి డ్రైనేజీ పైపులైన్‌లు వేసి ప్యాచ్‌వర్క్ పనులు చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాజులరామారం, సూరారం డివిజన్‌లలో ప్యాచ్‌వర్క్ పనులు చేయడంలో సంబంధిత అధికారులు తాత్సారం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పైపులైన్ వేసిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



హెచ్ఏఎల్‌కాలనీలో నాలుగో రోడ్డు దుస్థితి



హెచ్ఏఎల్ కాలనీలో..

భూ కబ్జాలను అరికట్టాలి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దరువు అంజన్న

గాజులరామారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను తెలంగాణ ఉద్యమకారుడు దరువు అంజన్న శుక్రవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాదారులు ప్రభుత్వ భూములు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. గాజులరామారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, కబ్జాలను అరికట్టాలని కోరారు.

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా

బాధ్యతలు చేపట్టిన కృష్ణమోహన్



కూకట్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన డి. కృష్ణమోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్‌ను మేడ్చల్ జోన్ సీసీఎస్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కృష్ణమోహన్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

జీడిమెట్ల సీఐగా పి.శ్రీనివాసరావు



జీడిమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల సీఐగా పి. శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఈయన అంతకు ముందు మాదాపూర్ సీసీఎస్ సీఐగా విధులు నిర్వహించారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

పేట్‌బషీరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల సమయం సమీపిస్తుండడంతో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులపై దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. సిలబస్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఫిబ్రవరి నుంచి స్లిప్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు

అడ్డంకులు తొలగించాలి

జీడిమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అడ్డంకులను తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. జయసింహారెడ్డి కోరారు. కుత్బుల్లాపూర్ మండలశాఖ ఆధ్వర్యంలో సూరారంలో నిర్వహించిన మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, కమల్‌సింగ్, సుకుదేవ్, గొడుగు శ్రీనివాస్, పురుషోత్తం, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతో..

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయొచ్చు

దుండిగల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఆర్ఐటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 2024 ప్రాజెక్ట్ ఎక్స్‌పోను శుక్రవారం నిర్వహించారు. దుండిగల్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన 200 మంది విద్యార్థులు వారు తయారు చేసిన ప్రాజెక్టులను ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ప్రపంచ సవాళ్లు, సాంకేతికత ఎలా పరిష్కరించగలదో విద్యార్థులు తెలియజేశారు. సీఐఈ ఇన్‌చార్జ్ డాక్టర్ వై. బలరామ్, డాక్టర్ సీహెచ్ అచ్చిరెడ్డి, ఎంఎల్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ శ్రేయారెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి అభినందించారు. కొత్త ఆవిష్కరణల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చని డైరెక్టర్ శ్రేయారెడ్డి అన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

కూకట్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మైసమ్మచెరువు నాలాను అభివృద్ధి చేస్తే వడ్డెర బస్తీ, శక్తినగర్, భరత్‌నగర్ వాసులకు వరదనీటి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

కూకట్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సులో శిక్షణ పొందాలనుకున్న యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి సీఈవో డా. యోబు తెలిపారు. ఆరోగ్య భద్రతపై నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. తొమ్మిది వారాలపాటు శిక్షణ కొనసాగుతుందని, పదో తరగతి పూర్తిచేసిన వారు అర్హులని వివరించారు.

ఆసక్తిగల వారు కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి ప్రాంగణంలోని కుముదినిదేవి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఈనెల 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

అర్హులకు కాంగ్రెస్ 'గ్యారెంటీ'లు

మియాపూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అర్హులకు కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీలు అందజేస్తామని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అర్హులైన అందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డివిజన్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీను, సత్యం, వీరారెడ్డి, ప్రేమ, మహిళలు లక్ష్మి, వినీత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



గోకుల్‌ప్లాట్స్‌లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



మహిళలతో మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

పేదల సంక్షేమానికి కృషి

జీడిమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్‌లో ప్రజాపాలన కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆయన కోరారు.

పేట్‌బషీరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నేటితో ముగియనుంది. కొంపల్లి మునిసిపల్ పరిధి 18 వార్డులో ప్రజాపాలన కేంద్రాలకు జనం తగ్గుముఖం పట్టారు. శుక్రవారం నాటికి 6,500 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కొంపల్లి మునిసిపల్ 5వ వార్డులో ప్రజాపాలన కేంద్రాన్ని కౌన్సిలర్ బైరి శ్రీవిద్యా ప్రశాంత్‌గౌడ్ సందర్శించారు. జీడిమెట్లలో ప్రజాపాలన కేంద్రాలను యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ పరిశీలించారు.

చందానగర్‌లో 5,836 దరఖాస్తులు

చందానగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 5,836 దరఖాస్తులు వచ్చాయని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. మాదాపూర్ హఫీజ్‌పేట, మియాపూర్, చందానగర్ డివిజన్లలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. శనివారం దరఖాస్తుల స్వీకరణకు చివరి రోజని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత



పడిపూజలో ఎమ్మెల్యే వివేకానంద్

షాపూర్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ జై దుర్గాభవానీ కాలనీలో యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడి పూజలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవారాధనతో మానసిక ప్రశాంతతతో పాటు ఇంద్రియ నిగ్రహం పెరుగుతుందన్నారు. డివిజన్ల అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, వార్డు సభ్యుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులు చేసే నాయకులకు ప్రజల మద్దతు

మంచి పనులు చేసే నాయకులకు ప్రజల మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం జామియా మసీదులో జరిగిన కార్యక్రమంలో మైనారిటీలు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనారిటీలకు అండగా ఉంటానని, వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మసీదు అధ్యక్షుడు అష్రఫ్, ఉపాధ్యక్షుడు అమీర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ నుసరఫ్, కార్యదర్శి మక్బూల్ సలహాదారుడు మహ్మద్ నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం కీలకం

ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఆస్పత్రి పర్సనలైజ్డ్ మెడిసిన్ ప్రామాణిక అభ్యాసంగా మారాలని, అందరికీ కచ్చితమైన, సమర్థవంతమైన, సరసమైన పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం అనేది కీలకమని ఏఐజీ ఆస్పత్రి చైర్మన్, గ్యాస్ట్రోఎంటరాలజీ చీఫ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఉప్పలూరి-హెచ్ పర్సనలైజ్డ్ మెడిసిన్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'జెనీకనెక్ట్ ఆర్ఎక్స్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్సనలైజ్డ్ మెడిసిన్‌పై పరిశోధనలు జరగాలన్నారు. డాక్టర్ వినయేందర్ తుల్లా మాట్లాడుతూ.. జెనీకనెక్ట్ ఆర్ఎ 'జెనీకనెక్ట్ ఆర్ఎక్స్' జన్యు సమాచారాన్ని డీకోడ్ చేయడం ద్వారా డ్రగ్ డిస్కవరీలో విప్లవాత్మక మార్పులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్ ఉప్పలూరి, హిమ చల్లా, ఏఐజీ ఆస్పత్రుల వైస్ చైర్మన్ పెన్మెత్స వెంకటసుబ్బరాజు, సీఎస్ఐఆర్ విశిష్ట శాస్త్రవేత్త, మాజీ డైరెక్టర్, సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ పీజీ హాస్టళ్లకు ముగ్గురు వార్డెన్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో లేడీస్ పీజీ హాస్టళ్లకు ముగ్గురు వార్డెన్లను నియమిస్తూ ప్రిన్సిపాల్ విజయకుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పీజీ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థినులు గురువారం జేఎన్‌టీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకరిని రెగ్యులర్ వార్డెన్‌గా, ఇద్దరిని అసోసియేట్ వార్డెన్లుగా నియమించారు. వీరితో పాటు డిసిప్లిన్ అండ్ మెయింటెనెన్స్ కో-ఆర్డినేటర్లుగా ఐదుగురు కాంట్రాక్టు అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఉచితంగా యోగా తరగతులు

ఆన్‌లైన్‌లో యోగా తరగతులను వసంత యోగా అకాడమీ నిర్వహిస్తోంది. 18 ఏళ్లు దాటిన వారికి తరగతులను ఉచితంగా అందించనున్నట్లు వసంత యోగా ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 7 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 6.30 గంటలకు తరగతులు జరుగుతాయని, వివరాలకు 9989703034 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.

సూరారంకాలనీలో బోర్ ప్రారంభం

జీడిమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సూరారంకాలనీ నల్లపోచమ్మగుడి వద్ద గల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బోర్‌ను మాజీ కార్పొరేటర్ జి.సురేశ్‌రెడ్డి ప్రారంభించారు.

లైంగిక వేధింపులపై అవగాహన

గచ్చిబౌలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ 8వ బెటాలియన్‌లో కమాండెంట్ సి.సన్ని ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సమస్యలు, ఎవరైనా అమర్యాదగా మాట్లాడినా, లైంగిక వేధింపులకు పాల్పడితే కమిటీకి తెలిపాలని సూచించారు.

బీసీ కులగణన చేపట్టాలి

- 29, 30 తేదీల్లో చలో ఢిల్లీ : ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలోపే బీసీ కులగణన చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29, 30 తేదీల్లో చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు.

శిల్పారామంలో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యువజన సర్వీసుల శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు

రాయదుర్గం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు-2024 శుక్రవారం ప్రారంభమయ్యాయి. యువజన సర్వీసుల శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా 33 జిల్లాలకు చెందిన యువత ఆయా ప్రాంతాలకు చెందిన వేషభాషలు, సంస్కృతి నేపథ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రదర్శనలు చేశారు. జానపద గాయనీ గాయకులు అరుణ, లింగా శ్రీనివాస్, ప్రశాంత్‌కుమార్, టీఎస్ స్టెప్ జనరల్ మేనేజర్ వేణుగోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ అనంతరెడ్డి, మేనేజర్ జగన్నాథం, అకౌంట్స్ ఆఫీసర్ టీ ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎక్స్‌కవేటర్ టైర్లలో గంజాయి

- ఇంట్లో నిల్వచేసిన 86 కిలోల సరుకు స్వాధీనం

జీడిమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో నిల్వచేసిన 86 కిలోల గంజాయిని సైబరాబాద్ ఎస్‌వోటీ, జీడిమెట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సీఐ పినకళ్ల శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లాకు చెందిన వెంకట శ్రీకృష్ణకాంత్ పాత నేరస్థుడు. ఇతడు కుత్బుల్లాపూర్ గ్రామ సమీపంలో వెంకటేశ్వరనగర్‌లో ఓ భవనంలో పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటున్నాడు. సీలేరు ప్రాంతానికి చెందిన గణేష్.. తన వద్ద గంజాయి ఉందని, దాన్ని రాజస్థాన్ తరలించాలని, డబ్బు ఇస్తానని అతడితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంగీకరించిన కృష్ణకాంత్ నగరం నుంచి గౌతం, కృష్ణను సీలేరు పంపించాడు. 86 కిలోల గంజాయి ఎక్స్‌కవేటర్ టైర్లలో నింపి బొలెరో వాహనంలో హైదరాబాద్ తరలించి కృష్ణకాంత్ నివాసంలో నిల్వచేశారు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున దాడిచేసి కృష్ణకాంత్‌ను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 1.70 లక్షలు ఉంటుందన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం

జీడిమెట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం ద్వారకానగర్‌లో నివాస ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ గోదాంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గోదాంలో ఎవరూలేని సమయంలో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. జగద్గిరిగుట్ట పోలీసులు గోదాం యజమానిపై కేసు నమోదు చేశారు. జనావాసాల మధ్య గోదాం నిర్వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లారీలో..



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దుండిగల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ లారీలో అగ్ని ప్రమాదం జరిగింది. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.5లో బ్లూ డార్ట్ సంస్థకు చెందిన డెలివరీ లారీలో మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై లారీని పక్కకు ఆపాడు. స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

నెంబర్ ప్లేట్ లేని 25 వాహనాలు స్వాధీనం

పేట్‌బషీరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నెంబర్ ప్లేట్ లేని 25 వాహనాలను అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. వాహనదారులకు ఏసీపీ వెంకటరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పట్టుకున్న వాహనాలను అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నెంబర్ ప్లేటు బిగించి పంపించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

పత్రికలు-రాజకీయాల మధ్య బంధాలు మారాయి



మాట్లాడుతున్న బుద్ధ మురళి

చిక్కడపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పత్రికలు, రాజకీయాలకు మధ్య సంబంధాలు సామాజిక, దేశ ప్రయోజనాల కోసం ఉండేవని, నేడు ఆర్థిక అవసరాల కోసం మారాయని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. షోయబుల్లాఖాన్ పత్రికా రచయితగా నైజాం అరాచకానికి వ్యతిరేకంగా పోరాడి రజాకార్ల ఆగ్రహానికి గురై హత్యకు గురయ్యారన్నారు. త్యాగరాయగానసభలో దశాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా షోయబుల్లాఖాన్ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. జర్నలిస్ట్ జయసూర్య మాట్లాడారు. ప్రజాసేవకుడు వైకుంఠం, గానసభ పాలకవర్గ కమిటీ సభ్యులు బండి శ్రీనివాస్ ద్రావిడ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన యువకుడికి విముక్తి

రాయదుర్గం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): యువకుడి కిడ్నాప్ కేసు చిక్కుముడి వీడింది. కిడ్నాప్ అయిన యువకుడికి పోలీసులు విముక్తి కల్పించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోకుల్‌ప్లాట్స్‌లో ఉంటూ ఓ సెల్‌టవర్ కంపెనీలో టెక్నికల్ సపోర్టర్‌గా పనిచేస్తున్న సురేందర్ తన చిన్నాన్న కూతురితో కలిసి గచ్చిబౌలి, ఖాజాగూడ లింకు రోడ్డులో మాట్లాడుతున్నాడు. కారులో నలుగురు వచ్చి అతడిని కిడ్నాప్ చేశారు. తనతో మాట్లాడుతుండగా అతడిని పట్టుకెళ్లారని, పోలీసులకు సమాచారమిస్తే చంపేస్తామంటూ బెదిరించారని యువతి పోలీసులకు వివరించింది. పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తు చేశారు. కిడ్నాప్ జరిగిన ప్రదేశంలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించిన పోలీసులు కిడ్నాప్ చేసేందుకు వచ్చిన నలుగురు వ్యక్తులలో సురేష్ అనే పాత నేరస్థుడు ఉన్నట్లు గుర్తించారు. సురేందర్‌ను కిడ్నాప్ చేసిన వ్యక్తులు రూ. 50 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. పోలీసులు కిడ్నాపర్ల చెర నుంచి సురేందర్‌ను విడిపించారు. నిందితులను అరెస్టు చేశారు.